క్లుప్తంగా

సమాజంలో మార్పు తెచ్చేది కవిత్వం

ప్రముఖ కవి డాక్టర్ వేదుల శిరీష



వేదుల శిరీషను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: కవిత్వంతో మార్పు తీసుకు రావచ్చని ప్రముఖ కవి, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వేదుల శిరీష పేర్కొన్నారు. ప్రపంచ కవిత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేటలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ మార్పు కోసం వారి వారి భావాలకు అక్షర రూపం ఇచ్చేది కవిత్వమన్నారు. సమాజంలో రుగ్మతలు పారదోలేందుకు జనాన్ని జాగృతం చేసేందుకు కవిత్వం పదునైన ఆయుధమన్నారు. కవిత్వానికి చదువు, వయసుతో సంబంధం లేదని సృజనాత్మకత ఉంటే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టరు అద్దాల సత్యనారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రవిశంకర్ పట్నాయక్, రెడ్నం రాజా, ఎంవీఎస్ఎల్ ప్రసూన, శ్రీదేవి, శ్రీవాణి, సునీత, మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ



గోశాలకు దాణా అందజేస్తున్న సన్‌రైజ్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక ఇంద్రపాలెంలోని గోపాల గోసంరక్షణ సంఘంలో ఉన్న గోవులకు శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ సభ్యులు పశుగ్రాసం (దాణా) తవుడు, మినప పొట్టు, పెసర పొట్టు, మొక్కజొన్నలు, తెలగపిండి, పాత బెల్లం, ఎండు గడ్డి, పచ్చగడ్డి అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీకృష్ణ వర్మ మాట్లాడుతూ వేసవి కాలంలో గోవులకు దాణా చాలా కష్టంగా ఉంటుందని సంఘ సభ్యుల ద్వారా తెలుసుకొని ఈ పశుగ్రాసాన్ని అందించినట్టు తెలిపారు. గోశాల ట్రైనర్ ఏవీ రంగారావు మాట్లాడుతూ సుమారు 86 ఆవులు ఈ సంఘంలో ఉన్నాయని, వాటికి అవసరమైన దాణాను క్లబ్ అధ్యక్షుడు రూ.40 వేలు ఖర్చు చేసి అందించారన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వి.దుర్గా మహేష్ వి.నగధర్, ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణాన్ని ఆపండి



కూరాడలో శిబిరం వద్ద మాట్లాడుతున్న వెంకట్రాజు

కరప: మండలం కూరాడలో శుక్రవారం అనధికారికంగా చేపట్టిన చర్చి నిర్మాణం పనులు ఆపాలని ఆ ప్రాంత ప్రజలు హైందవ సైన్యం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. హైందవ సైన్యం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకట్రాజు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్మించడంపై ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండేళ్లుగా నిలిపివేసిన చర్చి నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించడంతో రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్టు కొప్పిశెట్టి తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కరప: మండలం నడకుదురు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ ఈఈ ఎస్.ఉదయ్ భాస్కర్ తెలిపారు. నడకుదురులో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నడకుదురు సబ్‌స్టేషన్‌లో కొత్త ఫీడర్ అమర్చడం, ఇతర మరామ్మతులు చేస్తున్నారన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గురజనాపల్లి, నడకుదురు, పెనుగుదురు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఆయన వెంట కరప సబ్‌స్టేషన్ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ ఉన్నారు.

అడవులను కాపాడుకోవాలి

బోట్‌క్లబ్: అడవులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద సత్యడెంటల్ క్లినిక్‌లో శుక్రవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. అడవులు మానవ మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు చాలా ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లి, నాగేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

మరిడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎవరి దారి వారిది!



సైనిక్ భవన్ వద్ద చెత్త



కోర్టు వెనుక వైపు ఉన్న స్థలంలో చెత్త, చెదారం



సబ్‌జైలు వెనుక పరిస్థితి ఇదీ..



శిథిలమైన కోర్టు కాంపౌండ్ వాల్

- డంపింగ్ యార్డుగా కోర్టు ఆవరణ
- ఇష్టారాజ్యంగా పశువులు, కుక్కల సంచారం
- ఎన్నో ప్రభుత్వ శాఖలున్నా.. ఎవరికీ పట్టని సమస్య

కాకినాడ లీగల్: నగరంలోని ప్రధాన కూడలి అయిన జిల్లా పరిషత్ సెంటర్, కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కోర్టు కాంపౌండ్‌ను చెత్తచెదారంతో నింపేస్తున్నారు. ఈ ఆవరణలో 15 కోర్టులు ఉన్నాయి. వీటితో పాటు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం, జిల్లా ట్రెజరీ కార్యాలయం, సబ్ జైలు, సైనిక్ కార్యాలయం తదితరమైనవి ఇక్కడే ఉన్నాయి. దీంతో జిల్లాకు చెందిన వివిధ హోదాల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు సుమారు వెయ్యి మంది ఇక్కడ విధులు నిర్వహిస్తుంటారు. అలాగే న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు ఉద్యోగులు తదితరులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయాలకు వివిధ పనులపై నిత్యం వేలాదిగా ప్రజలు, క్రయ విక్రయదారులు, కక్షిదారులు వచ్చి వెళ్తుంటారు. ఈ ఆవరణలో వివిధ కార్యాలయాలు ఉండడంతో పర్యవేక్షణ బాధ్యత ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారాలను డంప్ చేస్తున్నారు. అలాగే ప్రహారీ గోడను ఆనుకుని నివసిస్తున్న ప్రజలు కూడా చెత్త వారిళ్లలోని చెత్తను ఈ ఆవరణలో వేస్తున్నారు. అలాగే కోర్టు వెనుక వైపు కాంపౌండ్‌వాల్ శిథిలమవడంతో పందులు, కుక్కలు, పశువులు ఆవరణలోకి చొరబడుతున్నాయి.

చెత్తను తొలగించాలి



పర్యవేక్షణ లేకపోవడంతో కోర్టు కాంపౌండ్ చెత్త చెదారంతో నిండిపోయింది. నిత్యం వేలాది మంది వివిధ పనులపై కోర్టు కాంపౌండ్ ఆవరణలోకి వివిధ కార్యాలయాలకు వస్తూ పోతుంటారు. ఈ ఆవరణలోకి పందులు, కుక్కలు రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కాంపౌండ్‌వాల్ నిర్మించి చెత్తచెదారం తొలగించి అహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కోరుతున్నాను.

ఎన్.నగేష్, న్యాయవాది గుమస్తా, కాకినాడ

క్రీడాకారులకు వసతులు కల్పించాలి



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన నాగబాబు

కాకినాడ సిటీ: జాతీయ వెటరన్ అథ్లెట్ యాతం నాగబాబు శుక్రవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పిఠాపురం మండలం జల్లూరికి చెందిన నాగబాబు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పని చేస్తూ వెటరన్ అథ్లెటిక్‌గా అనేక జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక అవార్డులను సాధించారు. క్రీడాకరులకు జీవో ప్రకారం సదుపాయాలు కల్పించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ



పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్

కరప: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఏఎస్పీ మనీష్ దేవరాజ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్‌ఐ టి.సునీత, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రికార్డులు అప్‌డేట్ చేసి ఉంచాలని, స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కేసుల విచారణ త్వరగా చేసి పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో చిరునవ్వుతో పలకరిస్తూ, వారి సమస్యను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. పోలీసులంటే ప్రజల్లో ఉండే భయాన్ని పోగొట్టి, వారికి భరోసా కల్పించాలని సూచించారు.

పదో తరగతి పరీక్షలకు 8 మంది గైర్హాజరు

కరప: మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. 905 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 897 మంది రాయగా, 8 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. మండలంలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ జరగలేదని ఎంఈఓలు వారు తెలిపారు.

మాలల హక్కులను హరిస్తున్నారు

- శాంతియుత ఆందోళనలను సైతం అణచివేస్తున్నారు
- రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్‌కుమార్



తన నివాసంలో దీక్ష చేపట్టిన జేఏసీ చైర్మన్ పండు అశోక్‌కుమార్ తదితరులు

కాకినాడ సిటీ: సీఎం చంద్రబాబు నాయుడు మాలల హక్కులను హరించాలని చూడడం రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ పండు అశోక్ కుమార్ అన్నారు. స్థానిక కరణం జంక్షన్ వద్ద శుక్రవారం ఆయన తన నివాసంలో నిరసన దీక్ష చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వంలో మాలలకు రక్షణ కరువైందని, మాలల హక్కులను ఈ ప్రభుత్వం హరిస్తోందన్నారు. శాంతియుత నిరసన చేసినా రాత్రి వేళల్లో పోలీస్ సిబ్బందిని పెట్టి గృహ నిర్బంధాలు చేసి రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. రాష్ట్రంలో మాలల ఓట్లు లేకుండా ఒక మాదిగల ఓట్లతోనే ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటయ్యిందని చంద్రబాబు అనుకుంటున్నారని అశోక్‌కుమార్ విమర్శించారు. రాజ్యాంగం, సుప్రీంకోర్టు నిబంధనలు తుంగలో తొక్కి మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. గతంలో ఒకసారి టీడీపీ ప్రభుత్వం మాలల దెబ్బ రుచి చూసిందని అది చంద్రబాబు మరచిపోయినట్టున్నారన్నారు. మరోసారి మాలల దెబ్బ రుచి చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన చేపట్టిన దీక్షకు జిల్లా మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు బుంగ సతీష్‌కుమార్, నాయకులు ఖండవిల్లి లోవరాజు, మాత సుబ్రహ్మణ్యం, బ్రహ్మజీ, లక్ష్మణరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘వర్గీకరణ’కు తీర్మానం అభినందనీయం



మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన కూటమి ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణపై అధ్యయనానికి నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికను ఆమోదించడంపై మాల, మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలందరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశానికి ముందుగా కేక్ కట్ చేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 59 ఎస్సీ ఉపకులాల జనాభా నిష్పత్తి ప్రకారం 15 శాతం రిజర్వేషన్‌ను న్యాయబద్ధంగా కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ ఏ గ్రూప్‌లో ఉన్న రెల్లి ఉపకులాల ప్రజలకు 1 శాతం, బి గ్రూప్‌లో ఉన్న మాదిగ ఉపకులాలకు 6.5 శాతం, సి గ్రూప్‌లో ఉన్న మాల ఉపకులాలకు 7.5 శాతం కేటాయించడంపై హర్షం వ్యక్తం అవుతోందని సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు వెంటనే నిలిపివేయాలని సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ తీర్మానాన్ని వెంటనే జాతీయ ఎస్సీ కమిషన్ అనుమతికి పంపాలని విజ్ఞప్తి చేసింది. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ప్రధాని నరేంద్రమోడీ, అమిత్ షాలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోకు సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలిషా, కాకాడ నూకరాజు, అనంతారపు రాజు, వల్లూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దాత ఆశయాలతో సేవలు



నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఈఓ విజయభాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బంగారు చిన శోభనాద్రి సత్రం ఈఓ చింతపల్లి విజయ్‌భాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని బంగారు చినశోభనాద్రి సత్రం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం అన్నదానం, నిరుపేదలకు వస్త్ర దానం చేశారు. తొలుత దాత బంగారు చినశోభనాద్రి విగ్రహానికి నివాళి అర్పించారు. పేదల కోసం ఆలయాలు, వివిధ సత్రాలు నిర్మించిన శోభనాద్రి ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలచి ఉంటారన్నారు. 1924లో ఈ సంస్థ స్థాపించి నిరుపేదలు కోసం తన ఆస్తిని సత్రానికి రాసి ఇచ్చిన బంగారు చినశోభనాద్రి మహనీయుడన్నారు. అనంతరం వెయ్యి మందికి నిరుపేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు బంగారు మోహన్, దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ పలువురు ఈవోలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఇద్దరికి ఐదు రోజుల చొప్పున జైలు, 10 మందికి రెండు రోజులు చొప్పున జైలు విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి ఐదు రోజులు చొప్పున జైలు, పది మందికి రెండు రోజులు చొప్పున జైలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గేట్ ర్యాంకర్‌కు అభినందనలు



సాయిచరణ్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాద్

బాలాజీచెరువు: గేట్-25లో 967 స్కోర్‌తో 9వ ర్యాంక్ సాధించిన ఈసీఈ విద్యార్థి సీహెచ్ సాయిచరణ్‌ను జేఎన్‌టీయూకే వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం అభినందించారు. జాతీయ స్థాయి పరీక్షలకు సాధనతో కృషిచేస్తే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని, తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో చదివినప్పుడు విజయాలు సునాయాసంగా అందుకోగలరన్నారు. వీసీ ప్రసాద్‌తో పాటు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఐఐఐపీటీ డైరెక్టర్ బత్తుల కృష్ణ, ప్రిన్సిపాల్ మోహనరావు, ఈసీఈ హెడ్ లీలాకుమారి ఉన్నారు.

పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాలి

- యువతకు ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకరరావు పిలుపు



గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: పరిశ్రమల స్థాపనపై యువత దృష్టి సారించాలని ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్ పేర్కొన్నారు. ఐడియల్ డిగ్రీ కళాశాలలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ వ్యాపారం, రాజకీయాలు డబ్బు ఉన్నవాళ్లే చేస్తే మిగతా జనం దేనికి పుట్టినట్లని ప్రశ్నించారు. పరిశ్రమలంటే కేవలం పట్టణాల్లో మాత్రమే నిర్మితమైనవి కాదని, గ్రామీణ ప్రాంతాల్లో స్థాపించి పదిమందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే అని భావించడం సరికాదన్నారు. ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి మాట్లాడుతూ చదువు వల్ల కేవలం ఉద్యోగం మాత్రమే వస్తుందనే ఆలోచన నుంచి బయట పడాలని, పరిశ్రమల స్థాపన ద్వారా తనకు తాను ఉపాధి సృష్టించుకోవడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చన్నారు. అనంతరం గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్, ఏవో కేఎస్ వాసు, ఎస్‌వీయూ వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ దాస రాజు, ఏయూ ప్రొఫెసర్ ప్రసాదరావు, డిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ, జీవీ కృష్ణంరాజు, మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కమలాదేవి, చిత్రంలో శ్రీదేవి, నిఖిత

కాకినాడ లీగల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైరపర్సన్ పి.కమలాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక జగన్నాథపురం ఆదిత్య హైస్కూల్‌లో పోక్సో చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి, ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌పై విన్యాసాలు

- అదేమని ప్రశ్నించినందుకు ఇద్దరిపై దాడి
- గొలుసు చోరీ చేసి యువకుల పరారు
- గొల్లప్రోలు హైవేపై ఘటన

పిఠాపురం: నిత్యం రద్దీగా ఉండే గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై విన్యాసాలు చేస్తూ ఇతర వాహనచోదకులను భయభ్రాంతులకు గురి చేసిన కొందరు యువకులు ఇదేం పని అని అడిగిన ఇద్దరిపై దాడి చేసి వారి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన మురాలశెట్టి సూర్యతేజ పాల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం పిఠాపురంలో పాలు విక్రయించి తిరిగి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. తాటిపర్తి జంక్షన్ దగ్గరకు వచ్చే సరికి ఇద్దరు యువకులు ఒక మోటారు సైకిల్‌పై నడి రోడ్డు మీద అడ్డదిడ్డంగా బండి నడుపుతూ ఎదురుగా వచ్చే వారిని ఆందోళనకు గురి చేస్తున్నారు. దీంతో సూర్యతేజ వారిని ఆపి మందలించాడు. అయినప్పటికీ వారి అదే తెంపరితనంతో అతనిపైకి దూసుకువచ్చే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడకు వచ్చిన తాటిపర్తికి చెందిన మరో వ్యక్తి పేకేటి ప్రసాద్ సైతం వారిని మందలించడంతో వారిరువురితో ఆ యువకులు వాగ్వాదానికి దిగారు. ఇంతలో అక్కడకు మరో మోటారు సైకిల్‌పై వచ్చిన మరి కొందరు యువకులు వారిని ప్రశ్నించిన వ్యక్తులపై దాడికి దిగి సూర్యతేజ మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. దీనిపై బాధితులు ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదుపై గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ మేళాలో 52 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

పిఠాపురం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 52 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఈ మేళాలో టీమ్‌లీజ్, పైటీఎం, ఎల్‌ఐసీ సంస్థలు పాల్గొన్నాయని వారు తెలిపారు. మొత్తం 142 మంది జాబ్‌మేళాకు హాజరు కాగా 52 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళి, ఇతర అధికారులు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా వాకలపూడి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డీసీ చైతన్య మురళి, ఏసీ రేణుక, సూపరింటెండెంట్ కృష్ణకుమారి తదితరులు

- నవోదయం 2.0 కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డీసీ చైతన్య మురళి

కాకినాడ రూరల్: సారా రహిత గ్రామంగా వాకలపూడిని తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని ఎక్సైజ్ శాఖ డీసీ వై.చైతన్య మురళి పిలుపు ఇచ్చారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వాకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేసేందుకు నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సారా తాగడం వలన అనర్థాలు, సారా తయారీ, విక్రయం వంటి చట్ట విరుద్ధ పనులు నిర్వహించడం వల్ల పడే శిక్షల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాటు సారా విక్రయించే గ్రామాలలో వాకలపూడి ఉందని, ఈ గ్రామం సి - గ్రేడ్‌లో ఉందన్నారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి మాట్లాడుతూ గ్రామంలో సారా తయారీ, విక్రయం జరిపే వారి వివరాలు టోల్ ఫ్రీ నంబరు 14405 ద్వారా తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్, ఎస్సై వరహాలు, రూరల్ ఎంపీడీఓ పి.సతీష్, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రయోగాలు చేయాలి



ఎగ్జిబిషన్‌లో మాట్లాడుతున్న ఆదిత్య కళాశాల కార్యదర్శి సుగుణారెడ్డి

బాలాజీచెరువు: పుస్తక పఠనంతో పాటు సాంకేతిక ప్రయోగాలు చేపట్టాలని ఆదిత్య కళాశాల కార్యదర్శి ఎస్.సుగుణారెడ్డి పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆరో సైన్స్ ఎగ్జిబిషన్ సైలాండ్-25ను ప్రారంభించి మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా ఆలోచించినప్పుడే పరిపూర్ణత చెందుతారని, తమ కళాశాలలో మారుతున్న కాలానికి తగ్గట్టుగా ల్యాబ్‌లతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, కృత్రిమ మేధ, భౌతిక, రసాయన, జీవ, గణాంక, ఎలక్ట్రానిక్స్, కామర్స్ విభాగాలకు చెందిన 170 ప్రాజెక్టులు ప్రదర్శించగా వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, టీ హాబ్ సీఈఓ నీలం బాబ్జీ, కియాటివో ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్ఆర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

డోన్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం



శాంతివర్ధనలో పండ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పెద్దాపురం: జన్యుపరంగా సంభవించే లోపాల వల్ల కలిగే చాలా మంది పిల్లలు డోన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నారని శాంతివర్ధన విభిన్న ప్రతిభాంతుల పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు, సత్య అన్నారు. మండలంలోని పులిమేరు శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శుక్రవారం వరల్డ్ డోన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబాబు, సత్య మాట్లాడుతూ జన్యుపరమైన క్రోమోజోమ్స్ వల్ల వచ్చే ఈ సమస్య పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. వివాహాలు ఆలస్యంగా చేసుకోవడం, బాల్య వివాహాల వల్ల క్రోమోజోములు సరైన మోతాదులో సంపర్కం జరుగక పోవడం ప్రధాన కారణమన్నారు. తొలుత దీనిని కనుగొన్న జాన్ లాంగ్ డోన్ చిత్రపటం వద్ద చిన్నారులు నివాళులర్పించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వేణు, అప్పలరాజు, ఆర్.చంటి, దుర్గావీరబాబు, శివ, శ్రీనివాస్, సరోజిని, విశాల, రాజేంద్ర, తదితరలు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో

మండలంలోని భవిత కేంద్రంలో శుక్రవారం వరల్డ్ డోన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌ఎం శివజ్యోతి విభిన్న ప్రతిభావంతులతో కలిసి కేక్‌ను కట్ చేశారు.